క్లుప్తంగా

ఘనంగా గ్రామదేవతల ఒడ్డు పండగలు


ఎం.కోడూరులో ప్రత్యేక అలంకరణలో మోదమాంబ అమ్మవారు

మాడుగుల రూరల్: మండలంలో పలు గ్రామాల్లో ఆదివారం గ్రామ దేవతలు ఒడ్డు పండగలు నిర్వహించారు. ఘాట్‌రోడ్డు చెరకు కాటా ఆవరణలో గల మోదమాంబ అమ్మవారికి ఘటాలు పండగను నిర్వహించారు. ఎం. కోటపాడు గ్రామానికి చెందిన కోట్ని వరహాలరాజు కుటుంబ సభ్యుల సారథ్యంలో అమ్మవారి ఘటాలు పండగ నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. ఎం.కోడూరు గ్రామంలో మోదకొండమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మింటే రాము నాయుడు కుటుంబ సభ్యుల సహకారంతో ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా ఆలంకరించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట


ప్రతిష్ట విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: దార్లపూడిలో మరిడిమాంబ ఆలయంలో నందీశ్వరిని విగ్రహం ప్రతిష్ఠించారు. తొలుత ప్రతిష్ట విగ్రహాలకు భారీ ఊరేగింపు నిర్వహించారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఆలయాల అభివృద్ధి పనుల్లో భాగంగా మరిడిమాంబ ఆలయం, రామాలయంలో విగ్రహాలు ప్రతిష్ట చేపట్టారు. అమలాపురం మండలం బట్నవిల్లికి చెందిన చంద్రమౌళి భాస్కర్‌శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల వేద మంత్రోచ్చారణలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. రామలయంలో సోమవారం తెల్లవారు జామున సిద్ధివినాయకుడు, సరస్వతీ దేవి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.

కంట్రోల్ రూం ఏర్పాటు

మాకవరపాలెం: తుపాను కారణంగా తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని తహసీల్దార్ జి.వెంకటరమణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 20వ తేదీ వరకు తుపాను ప్రభావంతో వర్షాలు పడే అవకాశం ఉన్నందున కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏ సహాయం కావాల్సి వచ్చినా తహసీల్దార్ కార్యాలయానికి సమాచారం అందించాలన్నారు. కంట్రోల్ రూం నెంబర్ 08932225820కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

నేటి నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు


ఎమ్మెల్యే కప్ టీ-షర్టులను అందజేస్తున్న కబడ్డీ అసోసియేషన్ సభ్యులు

మునగపాక: మండలంలోని నాగులాపల్లిలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో రాష్ట్ర స్థాయి మహిళలు, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఉరుకుటి శ్రీనివాసరావు తెలిపారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జన్మదినం సందర్భంగా జరిగే ఈ పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఆదివారం ఇందుకు సంబంధించిన టీ షర్టులను ఆయన అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర స్థాయిలో కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోజూ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో పోటీలు జరుగుతాయన్నారు. వర్షం వల్ల పోటీలకు అంతరాయం లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు దొడ్డి శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, నూకాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన

అచ్యుతాపురం రూరల్: సత్య సాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా పుట్టపర్తిలో నిర్వహించిన నృత్య ప్రదర్శన పోటీల్లో అచ్యుతాపురం ఇంటిగ్రేటెడ్ ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు పాల్గొన్నారు. ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి సభ్యులు రమణ, కృష్ణకుమారి ఆధ్వర్యంలో వీరు నృత్య ప్రదర్శన చేశారు. రాష్ట్రంలో 25 వేల మంది నృత్య కళాకారులు ఇక్కడ ప్రదర్శనలో పాల్గొన్నట్లు పాఠశాల వ్యవస్థాపకుడు పి.ఎస్.టి.పట్నాయక్ ఆదివారం తెలిపారు. పాఠశాల విద్యార్థినులు మానస, దేవిక, రేష్మ, కనకమహాలక్ష్మి, స్మయిత, ప్రణయ్‌లను ఆయన అభినందించారు.

దంచికొట్టిన వర్షం.. స్తంభించిన జీవనం

రహదారులు జలమయం ● మెట్ట భూముల్లో ముమ్మరంగా వరినాట్లు
జలాశయాలల్లో పెరుగుతున్న నీటి మట్టం


జలమయమైన వీధులు


మురుగునీటితో ఉన్న గృహాలు


భారీ వర్షాలకు తాచేరు నదిలో చేరిన నీరు

మాడుగుల రూరల్: అల్పపీడన ప్రభావంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. మెట్ట భూముల్లో వరినాట్లకు ఈ వర్షం ఎంతో అనుకూలంగా ఉంటుదని రైతులు పేర్కొన్నారు. ఈ వర్షాలతో మెట్ట భూముల్లో వరినాట్లు వేయడానికి రైతులు సిద్ధమయ్యారు. వర్షాల వల్ల వడ్డాది నుంచి పాడేరు పోవు రహదారి పూర్తి శిథిలావస్థకు చేరింది. ముకుందపురం, కె.జె.పురం, గ్రామ సమీపంలో రహదారి పూర్తిగా గోతులమయంగా మారింది.

వీధులన్నీ జలమయం

రోలుగుంట: భారీ వర్షాలకు మేజర్ పంచాయతీ రోలుగుంటలో లోతట్టు వీధులు, ఆర్‌అండ్‌బీ రోడ్లు జలమయమయ్యాయి. గ్రామస్థులు ఇళ్లలోంచి బయటకు అడుగుపెట్టే పరిస్థితి లేక వారి పరిస్థితి దయనీయంగా మారింది. ఒక మోస్తరు వర్షం పడినా లోతట్టు వీధులు జలమయయవుతున్నాయి. ఆదివారం ఈ సమస్య ఇక్కడ మరీ తీవ్రమయింది. ముఖ్యంగా బండారువీధి, అల్లువారి వీధి, యాత వీధి తదితర ప్రాంతాల్లో పరిస్థితి దయనీయంగా ఉంది. కాలువల్లో పూర్తిస్థాయిలో పూడికలు తీయక పోవడం, ఆర్‌అండ్‌బీ రోడ్డులో ప్రధాన మదుముల వద్ద పూడిక పేరుకుపోవడంతో రోడ్లపైకి వర్షపు నీరంతా చేరి ఇళ్లను కూడా ముంచెత్తుతోంది. పాలక వర్గం, అధికారులు స్పందించి కాలువలు, మదుముల్లో పూడిక తీయించి ముంపు కష్టాలు తప్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


బుచ్చెయ్యపేట : చోడవరం రోడ్డులో వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు


బుచ్చెయ్యపేట : ప్రధాన రోడ్డులో జోరుగా కురుస్తున్న వర్షం

విరిగిన చెట్లు, పొంగిన గెడ్డలు

గొలుగొండ: మండలంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి సుమారుగా నాలుగు గంటల పాటు ఎడతెరుపు లేకుండా వర్షం కురిసింది. పంట పొలాలు నీట మునిగాయి. ధారగెడ్డ, బొడ్డేరు, బోరింగ్ గెడ్డలు పొంగి ప్రవహించాయి. మండలంలో పలు ప్రధాన కేంద్రాలైన గొలుగొండ, చీడిగుమ్మల, ఏఎల్‌పురం, ఏటిగైరంపేట ప్రాంతాల్లో కండపోత వర్షం కారణంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. గెడ్డల నుంచి ప్రవహిస్తున్న భారీ వర్షం నీరు తాండవ జలాశయంకు చేరింది. తాండవ జలాశయం ప్రధాన ఆధారం అయిన ధారగెడ్డ, బొడ్డేరు గెడ్డల నుంచి ప్రవహిస్తున్న వర్షం నీరు వల్ల జలాశయం దిగువన నాట్లకు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. జోగుంపేట నుంచి జమ్మాదేవిపేట వెళ్లే గిరిజన గ్రామం మధ్యలో చింతచెట్లు వర్షం కారణంగా విరిగిపోవడం వల్ల రెండు గ్రామాల ప్రజలకు రాకపోకలు నిలిచిపోయాయి.


రోడ్డుపైన పారుతున్న వర్షపు నీరు

పొంగి ప్రవహిస్తున్న గెడ్డలు

మాడుగుల: రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు పంట చెరువులతో పాటు, పెద్దేరు, ఉరక గెడ్డ, తాచేరులు కొండగెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్ని చోట్ల నాటిన వరి మొనలు ముంపునకు గురవుతున్నాయి. దీంతో ఈ ఏడాది అతివృష్టి, అనావృష్టి వల్ల ఖరీఫ్ వరి పంటలు నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నర్సీపట్నంలో ఏకధాటిగా వర్షం

నర్సీపట్నం: అల్పపీడన ప్రభావంతో ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు కురిసిన భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. మున్సిపాలిటీలోని ప్రధాన రహదారితో పాటు, వీధుల్లోని రహదారులు జలమయయ్యాయి. వర్షం నీరు మెయిన్ రోడ్డుపై చేరడంతో అబిద్ సెంటర్ చెరువును తలపించింది. ప్రధాన డ్రైనేయిజీల్లో వర్షం నీరు పొంగి ప్రవహించింది. ప్రధాన ఎస్‌బీఐ వద్ద మెయిన్ రోడ్డు కల్వర్టు ఇరుకుగా ఉండడంతో రోడ్డుపై నీరు ఏరుల్లై ప్రవహించింది. నర్సీపట్నం, కేడీ పేట రోడ్డులో భారీగా వర్షంపు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది తలెత్తింది. సత్యసాయిబాబా ఆలయానికి వెళ్లే దారి సైతం ముంపునకు గురైంది.


దేవరాపల్లి : ఎం.అలమండలో పరగడి కాలువ పొంగి ప్రవహించడంతో నీట మునిగిన వరి పొలాలు

నీటమునిగిన పంటపొలాలు

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా ఆదివారం ఉదయం నుండి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురవడంతో జనజీవనం స్తంభించిపోయింది. సుమారు 11 సెంటీమీటర్లు మేర వర్షపాతం నమోదైంది. దీంతో పలు చోట్ల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దేవరాపల్లి, కాశీపురం, నాగయ్యపేట, పెదనందిపల్లి తదితర గ్రామాలలో వరి పంట నీట మునిగింది. ఎం.అలమండ సమీపంలోని పిరగడి కాలువ పొంగి ప్రవహించడంతో సుమారు 100 ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు, నదీ పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ లక్ష్మీదేవి సూచించారు.


నర్సీపట్నం, కేడీ పేట రోడ్డులో భారీగా చేరిన వర్షం నీరు


ఎం. కోటపాడులో కురుస్తున్న వర్షం


దేవరాపల్లిలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలి


పాడి రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ చిట్టినాయుడు

సబ్బవరం: ఎడతెరిపి లేని వర్షాల నేపథ్యంలో పాడి రైతులంతా తమ పశువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సబ్బవరం ప్రాంతీయ పశువైద్యశాల ఇన్‌చార్జ్ ఏడీ డాక్టర్ చిట్టినాయుడు తెలిపారు. మండలంలోని ఆరిపాక పంచాయతీ పరిధి చినయాతపాలెంలో పాడి రైతులకు పలు సూచనలు చేశారు. పాడుబడిన పశువులశాలలో పాడి పశువులను ఉంచవద్దన్నారు. పశువుల కొట్టాల్లో వాటిని తాళ్లతో కట్టవద్దని సూచించారు. నీరు ఎక్కువగా ఉండే గుంటలు, చెరువులు, జలాశయాల వద్దకు తీసుకెళ్లవద్దని హెచ్చరించారు. విద్యుత్ స్తంభాలకు దూరంగా ఉంచాలని, పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లు తుఫాన్ సమయంలో మరణించినట్లైతే 24 గంటల్లో దగ్గర్లోని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్‌కు లేదా పశు వైద్యశాల సిబ్బందికి తెలియజేయాలన్నారు. భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసర సేవలందించేందుకు మండలంలోని పశువైద్య సిబ్బందితో మూడు బృందాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

సందడిగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


కలుసుకున్న పూర్వ విద్యార్థులు

కోటవురట్ల: పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయికతో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం పులకించింది. విద్యార్థుల పలకరింపులను పరవశంగా ఆలకించింది. 1991–92 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం అదే చదువులమ్మ తల్లి చెంత కలుసుకున్నారు. ఉద్యోగ, ఉపాధి రీత్యా పలు ప్రాంతాల్లో స్థిరపడి ఒత్తిళ్ల మధ్య యాంత్రిక జీవనం గడుపుతున్న వారంతా ఆనాటి మధుర స్మృతులు గుర్తుకు రాగా చిన్నపిల్లల్లా మారిపోయారు. మనసంతా సంతోషంతో వెలిగిపోయిన ముఖాలతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఎక్కడ ఉన్నారు, ఎలా ఉన్నారు, పిల్లలు ఏం చదువుతున్నావంటూ ముచ్చట్లు చెప్పుకున్నారు. ఎన్ని సమస్యలు ఉన్నా, మళ్లీ మళ్లీ కలుసుకుందామంటూ ఒట్టేసుకున్నారు. ఆటపాటలతో సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పి ఉన్నత జీవితాలకు మార్గాన్ని ఇచ్చిన ఆనాటి ప్రిన్సిపాల్ షరీఫ్‌ను ఘనంగా సత్కరించారు. అనంతరం పాఠశాల ఆవరణలో మహాత్మా గాంధీ విగ్రహాన్ని తమ సొంత నిధులతో ఏర్పాటు చేసి ప్రిన్సిపాల్‌తో కలిసి ఆవిష్కరించారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల కమిటీల నియామకం

నాతవరం: వైఎస్సార్‌సీపీ మండల అనుబంధ సంఘాలకు నూతన కమిటీలను నియమించారు, దీనికి సంబంధించి సంఘాలు వారీగా అధ్యక్షుల వివరాలు ఇలా ఉన్నాయి. మండల బీసీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా వేముల నాగ వెంకట సూరిబాబు, మండల క్రిస్టియన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడిగా కాకర సింహాచలం మండల కల్చరల్ కమిటీ అధ్యక్షుడిగా పైల మణేంద్ర, మండల దివ్యాంగుల విభాగం అధ్యక్షుడిగా మామిడి రాజుబాబు, మహిళా విభాగం మండల శాఖ అధ్యక్షురాలిగా ఇనపసప్పల పుష్ప, మండల పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడిగా మిరపల వెంకటరమణ, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడిగా రెడ్డి సత్యనారాయణ, మండల సమాచార హక్కు (ఆర్‌టీ) విభాగం కమిటీ అధ్యక్షుడిగా కోసూరి వరహా పైడిరాజు(బుచ్చి), మండల రైతు విభాగం కమిటీ అధ్యక్షుడిగా అంకంరెడ్డి రాజుబాబు, మండల ఎస్సీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా బొడ్డు సత్యనారాయణ, మండల సోషల్ మీడియా కమిటీ అధ్యక్షుడిగా కర్రి వెంకటరమణ, మండల ఎస్టీ సెల్ కమిటీ అధ్యక్షుడిగా కూడా శ్రీను, మండల విద్యార్థి విభాగం కమిటీ అధ్యక్షుడిగా పుణ్యమంతుల స్వామి, మండల యూత్ విభాగం అధ్యక్షుడిగా బండారు పైడన్ననాయుడు, మండల వీవర్స్ విభాగం కమిటీ అధ్యక్షుడిగా పడాల లక్ష్మినర్సింహరావు, మండల వలంటీర్ల విభాగం కమిటీ అధ్యక్షుడిగా సిద్దాబత్తుల వెంకటరమణ, మండల వాణిజ్య విభాగవ కమిటీ అధ్యక్షుడిగా గ్రంధి జగన్‌ను నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. అధ్యక్షులతో పాటు కమిటీలో ఉపాధ్యక్షులు, జాయింట్ కార్యదర్శులు, కార్యదర్శులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు, కమిటీకి 18 మంది సభ్యులు చొప్పున ప్రతి కమిటీ నియమించారు.

ఘనంగా ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవం


ప్రభుత్వ ఆస్పత్రిలో మొక్క నాటుతున్న దృశ్యం


కె. కోటపాడు ఆస్పత్రిలో రోగులకు రొట్టెలు పంపిణీ

మాడుగుల రూరల్: ఆంధ్ర ప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఏపీయూడబ్ల్యూజే) 69 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మాడుగుల ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా యూనియన్ ఉపాధ్యక్షుడు రొబ్బా శ్రీనివాస్ తదితరులు మాడుగుల సెయింటాన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఆశ్రమం ఆవరణలో మొక్కలు నాటారు. యూనియన్ జిల్లా కార్యవర్గసభ్యులు ఏలూరు సురేష్, సీనియర్ పాత్రికేయులు, ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: రోలుగుంటలో ఏపీయూడబ్ల్యూజే వార్షికోత్సవం సందర్భంగా మండల కార్యలయం ఆవరణలో మొక్కలు నాటారు. పద్మా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గొందు సిద్దు, యూనియన్ మండల నాయకులు తమ్మునాయుడు, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కె. కోటపాడు: ఏపీయూడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఆదివారం స్థానిక వైద్యులు చేతల మీదుగా రోగులకు రొట్టెలు, పండ్లు అందజేశారు. యూనియన్ 69 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేశారు. యూనియన్ జిల్లా నాయకుడు కె. రాధాకృష్ణ, చోడవరం ప్రెస్‌క్లబ్ కార్యదర్శి సతీష్, పలువురు పాత్రికేయులు పాల్గొన్నారు.

మెరకభూముల్లో దమ్ములు


రోలుగుంటలో దమ్ముల పనులు చేసుకున్న రైతులు

రోలుగుంట: అల్పపీడన ప్రభావంతో శనివారం రాత్రి, ఆదివారం కురిసిన వర్షాలకు పల్లం, మెరక భూముల్లో జలకళ తాండవిస్తోంది. రెండు రోజుల క్రితం సాగునీటి అవకాశం ఉన్న కొమరవోలు ఆవ, శరభవరం, బుచ్చింపేట వడ్డిప గ్రామాల్లో మాత్రమే దమ్ములు పనులు జరిగాయి, రెండు రోజులుగా భూములు పదును లేక నారున్నా, నీరు లేక దమ్ములు పట్టలేని పరిస్థితి ఉండేది. ఈ సమయంలో కురిసిన వర్షాలకు చెరువులు, వాగుల్లో నీరు చేరింది. పంట భూముల్లో కూడా దమ్ములకు అనుకూలంగా వర్షం నీరు చేరడంతో రోలుగుంట, కంచుగుమల, కొండపాలెం తదితర గ్రామాల రైతులు దమ్ముల పనుల్లో నిమగ్నమయ్యారు.

వ్యాసరచన పోటీ విజేతలకు బహుమతులు


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ ఉమామహేశ్వరరావు

నర్సీపట్నం: ఏపీడబ్ల్యూజే ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోషల్ మీడియా– సమాజంపై పాత్ర అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విజేతలకు టౌన్ ఎస్ఐ ఉమామహేశ్వరరావు, యూనియన్ రాష్ట్ర కార్యదర్శి స్వామి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు చినబాబు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు నిత్యావసర సరుకుల వితరణ


గునుపూడిలో దివ్యాంగులకు ఇంటికి తీసుకెళ్లి నిత్యావసరకులు ఇస్తున్న దివ్యాంగుడు నూకరాజు

నాతవరం: గునుపూడి గ్రామంలో ఆదివారం దివ్యాంగులు నిరుపేదలకు విశ్రాంత ఎంఈవో తాడి అమృత్‌కుమార్ మనవడు జన్మదిన సందర్భంగా నిత్యవసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. గతంలో ఇక్కడ ఎంఈవోగా పని చేసిన అమృత్ కుమార్ తన కుమారుడు తాడి చైతన్య వికాస్ విజయసిరిల దంపతుల కుమారుడు అయాన్ విఖ్యాత్ జన్మదినం సందర్భంగా ఆదివారం పలు సేవా కారక్రమాలు నిర్వహించారు. గునుపూడి గ్రామానికి చెందిన దారా నూకరాజు ఆధ్వర్యంలో దివ్యాంగులైన నిరుపేదలకు సుమారుగా 50 మందికి నిత్యవసర సరుకులు, దుస్తులు పంపిణీ చేశారు. భారీ వర్షాలు కురవడంతో నూకరాజు స్వయంగా దివ్యాంగుల ఇళ్లకు ఆటోలపై నిత్యవరసరుకులు తీసుకెళ్లి అందజేశారు.

ఆర్భాటం జాస్తి...నాణ్యత నాస్తి!


కల్వర్టుల సమీపంలో శిథిలమైన తారురోడ్డు

- అసంపూర్తి రోడ్డు పనులతో అవస్థలు
- రూ.2.40 కోట్ల వ్యయం..రెండు మండలాలకు ఆధారం
- ఆర్భాటంగా భూమి పూజ చేసి పనులు ప్రారంభించిన కూటమి నేతలు
- రోడ్డు పనుల్లో నాణ్యతా ప్రమాణాలకు తిలోదకాలు


కొండగెడ్డలో నీరు పోయేందుకు నిర్మించిన వంతెన

నాతవరం: రెండు మండలాలను అనుసంధానం చేస్తూ కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన తారురోడ్డు అసంపూర్తి పనులకు ప్రయాణికులకు నరకంగా మారింది. మండలంలో వల్సంపేట పంచాయతీ శివారు ఉటమల్ల గ్రామం నుంచి గొలుగొండ మండలం కశిమి పంచాయతీ శివారు వడపర్తి గ్రామం మధ్య మట్టిరోడ్డుకు ప్రభుత్వం రూ.2.40 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు పంచాయతీరాజ్‌శాఖ ఇంజినీర్ల ఆధ్వర్యంలో తారురోడ్డు పనులు చేపట్టారు. గత ఏడాది ఈ పనులకు ఇంజినీరింగ్ అధికారులు కూటమి నేతలతో భూమి పూజలు చేయించి అర్భాటంగా పనులు ప్రారంభించి ఈ ఏడాది మార్చి నాటికి తారురోడ్డు పనులు పూర్తి చేశారు. తారురోడ్డు వేసేటప్పుడు మధ్య రోడ్డుకు కొండగెడ్డలు ప్రవహించే ప్రదేశాలలో కల్వర్టులు, వంతెనలు నిర్మించారు. వంతెన, కల్వర్టులు నిర్మించిన ప్రదేశాల్లో పనులు అసంపూర్తిగా చేసి వదిలేయడంతో ఏ మాత్రం వర్షం పడినా నీరంతా రోడ్డుపై నిలిచిపోతుంది. కల్వర్టుల వద్ద తారురోడ్డుకు సమాంతరంగా పనులు చేయకపోవడంతో ఏమరుపాటుగా డ్రైవింగ్ చేసే వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ తారురోడ్డు మారుమూల గిరిజన గ్రామాలకు చెందిన ప్రాంతం కావడంతో ఉన్నతాధికారులు తాకిడి ఉండదన్న ఉద్దేశ్యంతో పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వంతెనలు, కల్వర్టులు ఉన్న ప్రదేశాలలో తారురోడ్డు శిథిలమై అధ్వానంగా మారింది. తారురోడ్డు నిర్మించి ఏడాది గడవక ముందే ఈ విధంగా తయారైతే రోడ్డు నాణ్యత ప్రమాణాలు ఏవిధంగా ఉన్నాయో అని పలువురు ప్రశ్నిస్తున్నారు. గిరిజన ప్రాంతానికి తారురోడ్డు వస్తుందని ప్రజలు ఆనందపడ్డారు. ఇపుడు అసంపూర్తి పనులతో రోడ్డును చూసి తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై నర్సీపట్నం పంచాయతీరాజ్‌శాఖ డీఈ ఈశ్వరరావును వివవరణ కోరగా ముందు తారురోడ్డు నిర్మాణం మార్చి నాటికి పూర్తి చేశామన్నారు. వంతెన, కల్వర్టుల వద్ద పరిస్థితి వివరించగా వంతెన వద్ద మార్జిన్లు పనులు చేయాలన్నారు. కల్వర్టుల సమీపంలో తారురోడ్డు రాళ్లు తేలిన ప్రదేశాలలో సిమెంటు రోడ్డు వేస్తామన్నారు. మిగతా రోడ్డంతా బాగానే ఉందని అన్నారు. ఈరోడ్డు పనులకు సంబంధించి ఇంకా ఆఖరి బిల్లు ఇవ్వలేదన్నారు.